BHARATH SAMACHAR DIGITAL

17, అక్టోబర్ 2026, శనివారం

భారత్ సమాచార్

# రైతుల కష్టాలు తీర్చేందుకు మైనంపల్లి చొరవ



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: రామాయంపేట మండలం కాట్రియాల తండాలో నెలకొన్న లో వోల్టేజ్ విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు తమ సమస్యను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు.

## రైతుల విజ్ఞప్తితో స్పందన

కాట్రియాల తండాలో తక్కువ వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో సమస్యలతో పంటలకు సకాలంలో నీరు అందించలేకపోతున్నామని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి తమను ఆదుకోవాలని మైనంపల్లి హనుమంతరావును కోరారు.

## 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

రైతుల విజ్ఞప్తిపై స్పందించిన మైనంపల్లి హనుమంతరావు వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడారు. కాట్రియాల తండాలో లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. దీంతో తమ విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించనుండటంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కాట్రియాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త రాజేందర్ గుప్తా, రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar